కుంటలను పూడ్చండి!


సాయిఅనురాగ్‌కాలనీలో జనవాసాలకు సమీపంలో ఉన్న మురుగునీటి కుంట

నిజాంపేట్: అధికారులతో తీరుతో ప్రజారోగ్యంపై పెను ప్రభావం చూపుతోంది.. జనవాసాలకు సమీపంలో ఉన్న మురుగునీటి కుంటలను పూడ్చాలని విన్నపాలు చేస్తున్నా అధికారుల చెవికి మాత్రం ఎక్కడం లేదు. ఇదీ బాచుపల్లిలోని సాయిఅనురాగ్ కాలనీ దుస్థితి. పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో కార్పొరేషన్‌కు రెండు సార్లు జాతీయస్థాయి అవార్డులు వచ్చాయని గొప్పలు చెప్పుకునే ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎండా.. కాపాడును గొడుగు నీడ!

సుభాష్‌నగర్: రోజురోజుకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో బయటకు రావాలంటే జనాలు జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చే వారు ఇలా గొడుగులు పట్టుకుని కనిపిస్తున్నారు. ఎండ వేడిమి నుంచి గొడుగు నీడ కొంతైనా కాపాడుతుందని వారు పేర్కొంటున్నారు.


ఎండ తగలకుండా గొడుగు సాయంతో వెళ్తున్న విద్యార్థులు..

ఏపీహెచ్‌బీకాలనీ ఆర్చ్ నుంచి జలమండలి కార్యాలయం రోడ్డులో వేసిన స్పీడ్‌బ్రేకర్



దగ్గరకు వచ్చే వరకు స్పీడ్‌బ్రేకర్ ఉందని తెల్వదు!

రంగారెడ్డినగర్: ఏపీహెచ్‌బీ కాలనీ ముఖద్వారం నుంచి జలమండలి కార్యాలయం రోడ్డులో ఇటీవల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేశారు. అయితే ఏదైనా ప్రాంతంలో స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేసే ముందుకు సంబంధిత ట్రాఫిక్ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ అసోసియేషన్ సభ్యులు ఇవేమీ ఖాతరు చేయకుండా రోడ్డుపై పలు చోట్ల స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేశారు. స్పీడ్‌బ్రేకర్లు స్పష్టంగా కనిపించకుండా రోడ్డులో కలిసిపోవడంతో దగ్గరకు వచ్చే వరకు అక్కడ స్పీడ్‌బ్రేకర్ ఉందని తెలియడం లేదు. దీంతో వాటిని ఢీకొని వాహనదారులు గాయాలు పాలవుతున్నారు. ఇప్పటికైనా స్పీడ్‌బ్రేకర్లకు రంగులు వేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పార్కింగ్ కోసమే రోడ్డు వేసినట్లుంది!



రంగారెడ్డినగర్: డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్ ప్రధాన రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి హిందూ శ్మశానవాటిక వరకు రాకపోకలు సాగించేందుకు వీలుగా రూ.25లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారు. అయితే అంబేడ్కర్ విగ్రహానికి సమీపంలో ఉన్న ఇంటి యజమాని పార్కింగ్‌కు వీలుగా విగ్రహానికి ఆనుకుని రాడ్లు పాతడంతో ఓ వైపు రోడ్డు మార్గం మూసుకుపోయింది. ఇదే అదనుగా భావించిన కొందరు డీసీఎంలు, ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే నిలుపుతూ రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసమే లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్డును నిర్మించారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పార్కింగ్‌లను కట్టడి చేసి రాకపోకలకు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు కోరుతున్నారు.

సంజయ్‌గాంధీనగర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి హిందూ శ్మశానవాటికకు వెళ్లే రోడ్డుపై డీసీఎంలు, ద్విచక్ర వాహనాల అక్రమ పార్కింగ్

సునీతామహేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి


కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నియోజకవర్గంలోని పలు బస్తీలకు చెందిన ప్రజలు, నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వాన పత్రికలు అందజేశారు. పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన వద్ద ప్రస్తావించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు రజని గండయ్య తదితరులు శ్రీశైలం గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

నిజాంపేట్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తోందని.. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో సైతం విజయకేతనం ఎగురవేసి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడనుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.


కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

జువైనల్ హోమ్.. భద్రత నిల్!

- ఇటీవల 8మంది బాల నేరస్తులు పరార్
- ఈ ఘటనపై ఉన్నతాధికారులు సీరియస్
- ఇద్దరు సూపర్‌వైజర్ ఉద్యోగుల సస్పెన్షన్

సుభాష్‌నగర్: జువైనల్ హోమ్ నుంచి ఎనిమిది మంది బాల నేరస్తులు పారిపోయిన ఘటనలో ఇద్దరు ఉద్యోగులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. గండి మైసమ్మ బాచుపల్లి ప్రధాన రోడ్డును ఆనుకొని ఉన్న ప్రభుత్వ బాలుర ప్రత్యేక నదనం(జువైనల్ హోమ్)ను గురువారం హ్యూమన్ హ్యాండ్ చైల్డ్ కమిషనర్ కాంతి వెస్లీ పరిశీలించారు. జరిగిన ఘటనపై జువైనల్ హోమ్ సూపరింటెండెంట్ సంగమేశ్వర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

2008లో ఏర్పాటు...

గతంలో సైదాబాద్‌లో ఉన్న జువైనల్ హోమ్‌ను గాజులరామారంలోని గండి మైసమ్మ బాచుపల్లి ప్రధాన రోడ్డును ఆనుకొని సర్వే నం.342లో ఏర్పాటు చేశారు. బాల నేరస్తులుగా రుజువైతే వారిని ఇక్కడ ఉంచుతారు.

విద్యాబుద్ధులు...

ప్రస్తుతం ఇక్కడ 32 మంది ఉన్నారు. వారి బాగోగులు చూడడానికి వివిధ కేటగిరీలో పని చేస్తున్న 19 మంది సిబ్బంది ఉన్నారు. విద్యార్థులకు చదువే కాకుండా మెకానిక్, చేనేత వస్త్రాలు, టెక్నికల్, డ్రైవింగ్ పాడి పంటలకు సంబంధించిన విషయాలో అవగాహన కల్పిస్తున్నారు. వీరి శిక్ష అయిపోయిన అనంతరం వీరి వయసును బట్టి పెట్రోల్‌బంక్ ఇతర పనులలో ఉపాధి కల్పిస్తున్నారు.


గాజులరామారంలోని జువైనల్ హోమ్ ప్రధాన గేటు

భద్రత డొల్ల...

రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జువైనల్ హోమ్ చుట్టూ ప్రహరీపై సగం మేరకే కంచె ఉంది. మిగతా సగం ప్రహరీపై కంచ లేకపోవడంతో ఆ ఎనిమిది మంది పారిపోవడానికి మార్గం సుగగమైంది. చుట్టూ 19 సీసీ కెమెరాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నా ప్రధాన రోడ్డు వైపు మాత్రం మచ్చుకైనా ఏ ఒక్క సీసీ కెమెరా కనిపించడం లేదు.

ఉద్యోగులపై చర్యలు..

ఎనిమిది మంది పరారీ ఘటనలో పిల్లల పర్యవేక్షణ చూస్తున్న ఇద్దరు సూపర్‌వైజర్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. విధులపై నిర్లక్ష్యం ఉన్న సూపర్‌వైజర్ ప్రీతమ్ సింగ్, అంజి బాబులను బాధ్యులను చేస్తూ వారిపై వేటు వేశారు.

కాపలా దారి కరువు...

సంఘటన విషయమై 'సాక్షి' ప్రతినిధి అక్కడికి వెల్లగా జువైనల్ హోమ్ ప్రధాన గేట్ నుంచి జనాలు రావడం పోవడం కనిపించింది. ఇతర వ్యక్తులు లోనికి వచ్చే ముందు అక్కడ సెక్యూరిటీ గార్డ్ వారిని ప్రశ్నించి, వారి వివరాలు తెలుసుకొని ఉన్నతాధికారుల ఆదేశం మేరకే లోనికి అనుమతించాలి. కానీ అలాంటివేమీ అక్కడ కనిపించలేదు.

గాలిస్తున్నాం...

జువైనల్ హోమ్ నుంచి తప్పించుకున్న ఎనిమిది మంది బాలుర కోసం ఓ బృందాన్ని రంగంలోకి దింపామని సూరారం ఇన్‌స్పెక్టర్ వెంకటేశం తెలిపారు. మరో పక్క సీసీ కెమెరాల పుటేజీని సైతం పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.


జువైనల్ హోమ్, ప్రహరీకి ఓ వైపు సీసీ కెమెరాలు లేని దృశ్యం

మాలలను ఓట్లు అడిగే అర్హత బీజేపీకి లేదు

తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్

బంజారాహిల్స్: బీజేపీ మాలలను మోసం చేసిందని, కిషన్‌రెడ్డి, బీజేపీ నేతలు మాలలను ఓట్లు అడిగే అర్హత లేదని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. బంజారాహిల్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో మాలల జనాభా 80 లక్షలు ఉన్న సంగతిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మరచిపోయారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానాలు మూడు ఉంటే ఆ మూడింటిని కూడా మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన వారికే కేటాయించడం శోచనీయమన్నారు. అలాగే కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక సీటును కూడా మాదిగ సామాజిక వర్గానికే కేటాయించడం దుర్మార్గమన్నారు. ఎన్నికల జరిగే ఎస్సీ రిజర్వ్ స్థానాలన్నింటినీ మాదిగలకు కేటాయించి మాలలకు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీని మాలలంతా ఏకమై చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. బీజేపీలో ఉన్న మాలలు అందరూ బయటకు వచ్చి ఆ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా 400 సీట్లు వస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీ నాయకులు మాట్లాడాన్ని ఆయన ఖండించారు. మాదగ జాతి ఆత్మగౌరవాన్ని మంద కృష్ణమాదిగ కోట్ల రూపాయలకు బీజేపీ కాళ్ల దగ్గర పెట్టారన్నారు. ఆయన చెబితే వినేవారు ఎవరూ లేరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీలను ఓడించడానికి మాలలందరూ ఏకమై, ముఖ్యంగా సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కిషన్‌రెడ్డిని చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు.

'వలస పేదల సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేయాలి

జన్ సేవా సంఘ్

హిమాయత్‌నగర్: దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి హైదరాబాద్ నగరానికి వలస వచ్చిన పేదల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జన్ సేవా సంఘ్ డిమాండ్ చేసింది. వారి సంక్షేమం కోసం కృషి చేసిన పార్టీలకే పార్లమెంట్ ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని సంఘ్ నేతలు స్పష్టం చేశారు. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ్ అధ్యక్షుడు ఆర్‌పి సింగ్ మాట్లాడుతూ... హైదరాబాద్‌లోని లక్షలాది మంది ×ప్రవాస్తీ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తోందని, హైదరాబాద్‌లో నిర్మాణ, కార్మిక, కర్షక, రవాణా, ప్రవాసీ కూలీలు, చిరు వ్యాపారులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కమిషన్‌తో పాటు, ప్రవాసి భవనం, పాఠశాలలు, ప్రవాసీ ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టల్లు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి ప్రభుత్వాలు కృషిచేయాలని కోరారు. ఇందుకోసం హామీ ఇచ్చిన పార్టీలకే జన్ సేవా సంఘ్ ఎన్నికల్లో మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. సంఘ్ ప్రధాన కార్యదర్శి రాజీవ్ చౌదరి, కోశాధికారి వినీత్‌సింగ్, మాజీ అధ్యక్షుడు పరమానంద శర్మ, ఎల్.ఎమ్. చౌదరి, రాధే శ్యామ్, హరేందర్‌సింగ్, ఎస్.పి.సింగ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

నిబంధనలు పాటించని వాహనాలు సీజ్

నిజాంపేట్: మియాపూర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఎస్ఐపీ నవీన్‌కుమార్, సిబ్బంది మియాపూర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యూ టర్న్ సమీపంలో రాంగ్ రూట్‌లో వస్తున్న పలు వాహనాలను సీజ్ చేశారు. అదే విధంగా వీఎన్ఆర్ కళాశాల వద్ద ఎస్ఐపీ మల్లేశ్వర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్ పాటించని వాటర్ ట్యాంకర్, స్కూటీ, బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు. వారిపై బాచుపల్లి పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని, వాహనాల సీజ్‌తో పాటు కేసులు నమోదు చేస్తామని సీఐ ప్రశాంత్ హెచ్చరించారు.

సాంకేతిక విద్యకు నైపుణ్యతే కొలమానం

ఉస్మానియా యూనివర్సిటీ: సాంకేతిక విద్యకు నైపుణ్యం, సృజనాత్మకతే కొలమానమని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ అన్నారు. గురువారం యూనివర్సిటీ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై టెక్నోస్మానియా–2024ను ప్రారంభించి మాట్లాడారు. ఓయూ క్యాంపస్‌లో ఇంజినీరింగ్, టెక్నాలజీ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఉద్యోగాల కొదవలేదని ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలను సాధిస్తున్నారన్నారు. తాజాగా వెలువడిన సివిల్స్ ఫలితాల్లో ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం 2020 బ్యాచ్ విద్యార్థి మెరుగు కౌశిక్‌కు జాతీయ స్థాయిలో 82వ ర్యాంక్ సాధించడం గొప్ప విశేషమన్నారు. హైదరాబాద్, బెంగళూర్ మొదలు అమెరికాలోని సిలికాన్ వ్యాలీ వరకు ఓయూ ఇంజినీరింగ్ విద్యార్థులే కనిపిస్తున్నారన్నారు. స్వతహాగా కార్య నిర్వహణ సామర్థ్యం మెరుగు పరుచుకునేందుకు (మేనేజ్‌మెంట్ స్కిల్స్) ఏడు కోర్సుల విభాగాల విద్యార్థులే జాతీయ స్థాయిలో టెక్నోస్మానియా సదస్సును నిర్వహిస్తారని ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ శ్రీనునాయక్, అధ్యాపకులు, విద్యార్థి కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

భూదాన బోర్డును ఏర్పాటు చేయాలి

- ఆ భూములను అర్హులైన పేదలకు పంచాలి
- 74వ భూదాన్ దినోత్సవంలో మహాదేవ్, వెదిరె అరవింద్‌రెడ్డి

హిమాయత్‌నగర్: గొప్ప సంకల్పంతో ఏర్పాటు చేసిన భూదాన యజ్ఞ బోర్డుకు వెంటనే నూతన బోర్డును ఏర్పాటు చేసి దాని జ్యుడీషియల్ అధికారాలను కల్పించాలని పలువురు భూదాన ఉద్యమకారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత సర్వసేవా సంఘ్ సిఫార్సు చేసిన ప్రతినిధులతోనే భూదాన బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో ఇంకా మిగిలి ఉన్న దాదాపు లక్షన్నర ఎకరాల భూదాన భూములను నిరుపేదలకు అందిచడమే భూదాన యోధులకు నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు. పేదలందరికీ భూములు దక్కే వరకు భూదాన పోరాటాన్ని కొనసాగిస్తామని వారు ప్రకటించారు. అఖిల భారత సర్వసేవా సంఘ్ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో '74వ భూదాన్ దినోత్సవం' గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించారు. అఖిల భారత సర్వసేవా సంఘ్ జాతీయ మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి, అధ్యక్షుడు వెదిరె అరవింద్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ ట్రస్టీ కృష్ణ గౌడ్‌లతో కలిసి వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి భూదాన యజ్ఞ బోర్డు ఏర్పాటు, భూమి పంపిణీ గురించి విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. పేదలకు పంచాల్సిన భూములను తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీలకు, కంపెనీలకు, గోశాలలకు పంచడం అన్యాయమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి తన కూతురు పేరుతో భూదాన భూములను కొనుగోలు చేసి అనంతరం ఆ భూమి భూదాన భూమి అని తనకు తెలియదనడం విడ్డూరమన్నారు. భూదాన భూములను పేదలకు పంచాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. యోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేసేందుకు హైదరాబాద్‌లో ఒక స్మారకాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు ఎకరాల భూమిని ఇస్తే తమ సొంత ఖర్చుతో అందులో స్మారకాన్ని నిర్మిస్తామన్నారు. తెలంగాణ సాయుధపోరాట యోధులు, భూదాన దాతల కుటుంబ సభ్యులు డాక్టర్ ప్రబోద్ చంద్రారెడ్డి, సురవరం కష్ణవర్ధన్ రెడ్డి, సాగర్ రెడ్డి, మల్లు కరుణ, బీంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆరుట్ల సుశీలా దేవి, రావి ప్రతిభ, మమత, గరిగంటి రమేష్, చందూ పటేల్, దిడ్డి రాంబాబు, దిలీప్ నేత, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



జీడిమెట్ల: గ్యాస్ గోదాముల యాజమాన్యం అగ్నిప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జీడిమెట్ల అగ్నిమాపక కేంద్రం అధికారి సుభాష్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం గాజులరామారంలోని ఎల్‌పీజీ గ్యాస్ గోదాంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది గ్యాస్ గోదాం కార్మికులకు అగ్నిప్రమదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జీడిమెట్ల ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

చేతిపంపును బాగు చేయించండి

చింతల్: చేతిపంపును బాగు చేయించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని గురువారం మైసమ్మ నగర్ బీ-బ్లాక్‌కు చెందిన సృజన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... బస్తీలోని రోడ్ నం.6లోని కమ్యూనిటీహాల్ వద్ద ఉన్న చేతి పంపు కొన్నేళ్లుగా పనిచేయడం లేదన్నారు. దీంతో ఎవరైనా చనిపోతే నీళ్ల కోసం పక్క బస్తీలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం వేసవి కాలంలో నీటి సమస్య నెలకొందని.. అధికారులు స్పందించి చేతిపంపును అందుబాటులోకి తెస్తే సమస్య కొంత వరకు తీరుతుందన్నారు. స్పందించిన జీఎం శ్రీధర్‌రెడ్డి త్వరలోనే సిబ్బంది పంపి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సైబర్ నేరాలపై అవగాహన

హిమాయత్‌నగర్: సైబర్ మోసాలు రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ క్రైమ్ పోలీసులు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నారు. అపార్ట్‌మెంట్, కాలనీలతో పాటు కాలేజీలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం నగర సైబర్ క్రైమ్ సీఐ బోస్ కిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది హిందీ మహావిద్యాలయలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు సైబర్ నేరాలు జరిగే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్టుబడుల మోసాలు, ఫెడెక్స్, ట్రేడింగ్ ఇతర సైబర్ మోసాలు జరుగుతున్న విధానాన్ని, వాటి పట్ల అప్రమత్తంగా ఎలా ఉండాలో వివరించారు.

మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ మైనార్టీ నాయకుల సమావేశం గురువారం మెట్రో ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, ఆయా డివిజన్ల మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీఎస్‌ఐఐసీకాలనీ సీనియర్ సిటిజన్ ఫోరమ్ ఏకగ్రీవం


నూతన ఫోరమ్ సభ్యులు

జీడిమెట్ల: టీఎస్‌ఐఐసీ కాలనీ సీనియర్ సిటిజన్ ఫోరమ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకయ్యింది. అధ్యక్షుడిగా ఇందుకూరి భాస్కరరాజు, ప్రధాన కార్యదర్శిగా సి.సాయిబాబ, ట్రెజరర్‌గా కేవీసీవీ సాగర్, వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్.సూర్యనారాయణ, కేవీ సుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.మామిళ్లయ్య, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.బసవపున్నయ్య, బి.సుజాత, కమిటీ మెంబర్స్‌గా అర్.వీరచారి, షేక్ అబ్దుల్ జబ్బార్, ఎ.వెంకటేశ్వరావు గౌరవ సభ్యులుగా కే.గిరీధర్, ఎస్.అమ్మాజీ, టి.సుజాత అడ్వైజర్లుగా సీహెచ్. సురేష్‌బాబు, డి.కోటినాగేశ్వరరావు, సీహెచ్ నర్సింహాచార్యులు, జి.వెంకట రమణారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు రేపు జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నేడు, రేపు (19, 20న) జాతీయ సదస్సు జరగనుంది. భౌతిక, గణిత శాస్త్రాలలో ఇటీవల పురోగతులు అనే అంశంపై సదస్సుకు ముఖ్యఅతిథులు ఏపీ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ జేడీ డాక్టర్. పి బాబుతో పాటు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం, ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి హాజరైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.సుకన్య తెలిపారు. అనంతరం సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.అనితా అబ్రహం, డా.బంగ్లా భారతీ, ఎస్ నిర్మల, సదస్సు కన్వీనర్లు డా.చిన్నబాబు, డా.మల్లేశ్వరీ, సహ కన్వీనర్లు విజయ నిర్మల, ఎల్ విష్ణుప్రియ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

జగద్గిరిగుట్ట: ప్రైవేట్ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇంజినీరింగ్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపురం షిర్డీహిల్స్ ప్రాంతానికి చెందిన రాములు కుమారుడు లక్ష్మణ్. లేపాక్షి కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. కాగా గురువారం ఉదయం 6.30గంటల సమయంలో టిఫిన్ తీసుకొచ్చేందుకు ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో మల్లారెడ్డినగర్ చౌరస్తా వద్ద వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు లక్ష్మణ్

వాల్మీకి రామాయణమే అసలైనది..

పంజగుట్ట: రామాయణ చరిత్రలు వివిధ కవులు, రచయితలు రాసినవి సుమారు 300 వరకు ఉన్నాయని కాని అసలైన రామాయణం వాల్మీకి రామాయణమే దాన్ని భావి తరాలకు అందించాలనే ఈ హిందీ రామాయణ అనువాదం తీసుకువచ్చినట్లు అనువాదకర్త దంపతులు ప్రగ్యా బంకా, అనంత్ కేతాన్ తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హిందీ రామాయణం పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వాల్మీకి రామాయణం సంస్కృతంలో ఉండటం, సంస్కృతం ఎక్కువమందికి రాకపోవడంతో ముంబయికి చెందిన అమీ గణంత్రా వాల్మీకి రామాయణం ఆధారంగా రచించిన ఆంగ్ల రామాయణ గ్రంథం 'రామాయణం అన్ రవైల్డ్' హిందీలోకి అనువదించాలని తమను కోరినట్లు దీంతో తాము సుమారు సంవత్సరం పాటు ఇందులో నిమగ్నమై హిందీ రామాయణ్‌కా అన్‌వరన్ పుస్తకం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వారు తెలిపారు.

ఇన్‌స్టా వీడియోలు లైక్ చేయాలంటూ ప్రభుత్వ ఉద్యోగికి టోకరా

హిమాయత్‌నగర్: సోషల్ మీడియాలో ఇన్‌స్టాగ్రామ్ వీడియోలను లైక్ చేయడం ద్వారా డబ్బు సంపాదించవచ్చని నమ్మించి ఓ ప్రభుత్వ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం... నగరానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగిడికి ఇన్‌స్టాగామ్ వీడియోలను లైక్ చేయడం ద్వారా డబ్బు సంపాదించాలని వాట్సాప్ ద్వారా మెసేజ్ వచ్చింది. తాము ఇచ్చిన టాస్కులు పూర్తి చేసిన అనంతరం కమీషన్ మొత్తం చెల్లిస్తామన్నారు. అనంతరం గూగుల్ రివ్యూలు ఇవ్వాలంటూ రోజువారీ టాస్కులు ఇచ్చారు. తాము ఇచ్చిన టాస్కులన్నీ పూర్తయిన తర్వాత వారు బాధితుడి 30 నుంచి 60 శాతం కమీషన్ ఇస్తామన్నారు. ఇది నమ్మిన బాధితుడు వారు చెప్పిన విధంగా పెట్టుబడి పేరుతో మొదటి టాస్క్‌లో బాగంగా రూ. 20 వేలు, రెండో టాస్క్‌లో రూ. 60 వేలు, చివరి టాస్క్‌లో రూ. 5,00,000, రూ. 10,00,000 చెల్లించాడు. అనంతరం సైబర్ నేరగాళ్లు రూ.20 లక్షలు డిమాండ్ చేయగా, బాధితుడు 90,000 చెల్లించాడు. ఈ విధంగా బాధితుడు మొత్తం రూ.16,70,000 మోసపోయాడు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యా చేశాడు.

డెబిట్ కార్డ్ బ్లాక్ అయిందంటూ మోసం...

సికింద్రాబాద్‌కి చెందిన ఓ 74 ఏళ్ల వృద్ధుడిని తన యూనియన్ బ్యాంక్ డెబిట్ కార్డ్ బ్లాక్ అయిందంటూ సైబర్ నేరాగాళ్లు మోసం చేశారు. తన ఏటీఎమ్ కార్డ్ బ్లాక్ అయిందని, పాన్ కార్డ్ అప్‌డేట్ చేయాలంటూ వివిధ కారణాలు చెబుతూ తన ఇతర బ్యాంక్‌ల నుంచి రూ. 1.40 లక్షలను కాజేశారు. మోసపోయానని బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు వెంటనే 1930కి కాల్ చేయాలని ఏసీపీ శివమారుతి సూచించారు.